క్లుప్తంగా

30న మండల సర్వసభ్య సమావేశం

దేవనకొండ: ఈనెల 30న మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఇద్రూస్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరుకావాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ గోపాల్

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు విస్తృత సోదాలు చేస్తున్నారు. శనివారం పత్తికొండలోని గుత్తిరోడ్డు కూడలిలో ఎస్‌ఐ గోపాల్ తన సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తుండటంతో ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కూర్మ నారాయణుడికి ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలో కొండల్లో వెలసిన కూర్మ నారాయణ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయలో స్వామి వారికి గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు, రచయిత మానికింద నారాయణ రచించిన కూర్మ నారాయణ స్వామి భక్తి పాటల క్యాసెట్‌ను భక్తుల సమక్షంలో విడుదల చేశారు. భక్తులు రచయితను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నరేష్ పాల్గొన్నారు.

గిట్టుబాటయ్యేలా పనులు చేయాలి



రామాపురం వద్ద మస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఏపీడీ పక్కీరప్ప

తుగ్గలి: రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా కూలీలు కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. శనివారం రామాపురం, ఉప్పర్లపల్లి సమీపంలో చేపట్టిన ఉపాధి పనులను తనిఖీ చేసి పండ్ల తోటలను పరిశీలించారు. పని ప్రదేశంలో మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. చేస్తున్న ఉపాధి పనులు రైతులకు ఉపయోగపడాలన్నారు. ఇంకుడు గుంతల వల్ల వర్షపు నీరు నిలిచి భూగర్భలాలు పెరుగుతాయన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలన్నారు. పండ్ల తోటల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించారు. ఏపీడీ వెంట క్లస్టర్ టీఏ గంగన్న, టీఏ వెంకప్ప, ఎఫ్ఏలు వీరభద్రప్ప, రాజునాయక్ ఉన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ

దేవనకొండ: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ సురేష్‌బాబు డీలర్లను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొన్న విత్తనాలకు రసీదు పొందాలన్నారు. లైసెన్స్ కంపెనీ విత్తనాలను మాత్రమే డీలర్లు అమ్మాలని, ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విత్తనాలను అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా విత్తనాలను నాటిన తర్వాత విత్తన ప్యాకెట్లను తమ వద్దే ఉంచుకోవాలన్నారు. బిలుల్లు లేకుండా తక్కువ ధరకు ఇస్తానంటే తీసుకోవద్దన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



భీమప్ప (ఫైల్)

హాలహర్వి: మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ భీమప్ప(62) శనివారం పని ప్రదేశంలోనే గుండెపోటుకు గురయ్యాడు. తోటి కూలీలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబాన్ని ఏపీఓ హేమసుందర్ పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు నగదును అందజేశారు.

బడుగుల జీవితాల్లో ‘వెలుగులు’

- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- మండలంలో 1,800 కుటుంబాలకు లబ్ధి



బలహీనవర్గాలైన ఎస్సీ, ఎస్టీలు వినియోగించే గృహ విద్యుత్‌కు పైసా బిల్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అండగా నిలుస్తోంది. ఆ వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తూ భరోసా కల్పిస్తోంది. ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపారు. దీంతో బడుగు, బలహీనవర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా హాలహర్వి మండలంలో 1,560 ఎస్సీ కుటుంబాలు, 240 ఎస్టీ కుటుంబాలు కలిపి మొత్తం 1,800 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి.

– హాలహర్వి

టీడీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చేసిందేమీ లేదు. పేరుకు మాత్రం నెలకు 120 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలపై వివక్ష చూపుతూ అధిక బిల్లులు మోపేవారు. అధికారుల చేత విద్యుత్ చౌర్యం కింద కేసులు కూడా నమోదు చేయించి వేధించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీలకు ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని బడుగు, బలహీన వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల కష్టాలను తెలుసుకున్న నాయకుడి వెంటే తామంతా ఉంటామని చెబుతున్నారు. ఉచిత విద్యుత్‌తోపాటు అన్నివిధాలా ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహిస్తున్నారని కొనియాడుతున్నారు.

ఆర్థిక భారం తగ్గింది



టీడీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో ఎస్సీ కుటుంబానికి ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను సరఫరా చేస్తుండడంతో ఆర్థిక భారం తగ్గింది.

– వీరేష్, మెదేహాల్ గ్రామం

ఉచిత విద్యుత్ అందించడం సంతోషం



దినసరి కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే మాలాంటి వారికి విద్యుత్ బిల్లు కట్టాలంటే ఇబ్బందిగా ఉండేది. కుటుంబ పోషణ కష్టతరంగా మారిన సమయంలో ప్రతినెలా విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుండడం ఎంతో ఉపయోగకరంగా మారింది. జగనన్న హామీ ఇచ్చి నెరవేర్చడం సంతోషంగా ఉంది.

– ఎరుకల హనుమంతు, హాలహర్వి

జగనన్నకు రుణపడి ఉన్నాం



ఇచ్చిన మాట ప్రకారం జగనన్న నిరుపేదలైన ఎస్సీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తున్నారు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న మాలాంటి వారికి ఇది ఎంతో ఊరట. కరెంట్ బిల్లు మిగలడంతో ఇతర అవసరాలకు ఉపయోగపడుతున్నాయి. మేం జగనన్నకు రుణపడి ఉంటాం.

– యాకోబు, బాపురం గ్రామం

ఖరీఫ్‌లో రైతులకు సమస్య రానీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాస్

పత్తికొండ టౌన్: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు విత్తన కొరత లేకుండా చూడాలని ఎంపీపీ నారాయణదాస్ వ్యవసాయ అధికారులకు సూచించారు. శనివారం పత్తికొండలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీడీఓ రామారావు అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. ఇప్పటికే రైతులకు విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నందున రైతుల ఇండెంట్ ప్రకారం విత్తనాలు పంపిణీ సజావుగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం మండల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. అనంతరం ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు నజీర్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షం.. హర్షం

తుగ్గలి: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కుంటలు, చెక్‌డ్యాంల్లో వర్షపు నీరు చేరింది. 42.4 మి.మీ వర్ష పాతం నమోదైంది. ఈదురు గాలులకు పలుచోట్ల కొట్టాల పైకప్పు ఎగిరిపోయాయి. చెట్లు విరిగిపడ్డాయి. పగిడిరాయి–అమినాబాద్ మధ్య ఫైబర్ నెట్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడిపోయి రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. కాగా వర్షం వేసవి దుక్కులకు బాగా ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దేవనకొండ మండలంలో..

దేవనకొండ: మండలంలోని మాచాపురం, నెల్లిబండ, బండగట్టు తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులలో కూడిన వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి అంధకారం నెలకొంది. శనివారం విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కూలిన వృక్షం..

మద్దికెర: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులకు భారీ వృక్షం కూలి ట్రాక్టర్‌పై పడింది. చిలుకలూరిపేటకు చెందిన అంజిరెడ్డి మద్దికెర గ్రామంలో కౌలుకు భూములు చేసుకొని జీవనం చేస్తున్నాడు. తన ట్రాక్టరును మద్దమ్మకుంట వద్ద ఉన్న వాముదొడ్డిలో ఉంచాడు. రాత్రి వచ్చిన భారీ గాలులకు చెట్టు కూలి ట్రాక్టర్‌పై పడింది



ట్రాక్టర్‌పై పడిన చెట్టు

నివాళి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి గోపాల్‌రెడ్డి కోడలు శ్రీలేఖ(24) ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వెల్దుర్తికి చేరకుని శ్రీలేఖ మృతదేహంపై పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి ఉన్నారు.

రైతులకు కిట్ల పంపిణీ

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం, హంప గ్రామాలకు చెందిన ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరు చేసిన కిట్లను శనివారం అధికారులు పంపిణీ చేశారు. అయితే తమకు తెలియకుండా పంపిణీ చేయడమేంటని సర్పంచ్ విజయుడు అధికారులను నిలదీశారు. రైతుభరోసా కేంద్రాల్లో గానీ, సచివాలయాల్లో గానీ వ్యవసాయధికారి కార్యాలయాల్లో గానీ పంపిణీ చేయకుండా రహస్యంగా ఎందుకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వేరుశనగ విత్తన కాయల పంపిణీ



విరుపాపురంలో వేరుశనగకాయల అందజేస్తున్న ఏఓ శివశంకర్

హాలహర్వి: మండలంలోని విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం సబ్సిడీ వేరుశనగకాయలను మండల వ్యవసాయాధికారి శివశంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుగూ మండలానికి 205 క్వింటాళ్ల కే–6 రకం వేరుశనగ కాయలు మంజూరయ్యాయన్నారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు వెంకటలక్ష్మి, రాజేంద్ర పాల్గొన్నారు.

తుగ్గలి మండలంలో..

తుగ్గలి: ఖరీఫ్ సాగు కోసం 40 శాతం సబ్సిడీతో మంజూరైన వేరుశనగ విత్తన కాయల పంపిణీ శనివారం ప్రారంభమైంది. మారెళ్ల, ముక్కెల్ల, జి.ఎర్రగుడి, గిరిగెట, తుగ్గలి, రాతన, పెండేకల్లు ఆర్‌బీకేల్లో వ్యవసాయశాఖ సిబ్బంది విత్తన పంపిణీని ప్రారంభించారు. వేలి ముద్రల సేకరణ ద్వారా రైతులకు విత్తన కాయలు పంపిణీ చేశారు. తొలి రోజు 7 ఆర్‌బీకేల్లో 1,200 మంది రైతులకు 900 క్వింటాళ్ల విత్తనకాయలు అందజేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో మండలానికి 5,700 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలను ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు.

చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి



మాట్లాడుతున్న పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి

పత్తికొండ రూరల్: తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి సూచించారు. మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా శనివారం కోర్టు ఆవరణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి భారతి మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో పిల్లలు తల్లిదండ్రులతో గొడవలు పడి ఇంటిని వదిలేసి వెళ్లిపోతున్నారన్నారు. అందులో ఆడపిల్లలు ఎక్కువ మంది ఉండటం ఆందోళనకరమన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి రక్షణ కరువై వేధింపులకు గురై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి చేతుల్లో పావులుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుక్తవయసు పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. మంచి పౌరులుగా పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, న్యాయవాదులు మైరాముడు, ఈరన్న, రవిప్రకాశ్, బాలబాషా పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- ఆలూరు సెబ్ సీఐ డి.సోమశేఖర్

ఆలూరు: మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు సెబ్ సీఐ డి.సోమశేఖర్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 53 మందిపై కేసులను నమోదు చేశామన్నారు. వీరితో పాటు పాత కేసుల్లోని మరో 12 మందితో కలిసి మొత్తం 65 మందిని అరెస్ట్ చేశామన్నారు. హాలహర్వి మండలం క్షేత్రగుడి, హొళగుంద మండలం మార్లమిడికి చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేశామన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు.

తారు రోడ్లు...తళతళ

ఆలూరు రూరల్: మండలంలో రహదారులు తళతళా మెరుస్తున్నాయి. దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని రోడ్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో నూతన రూపును సంతరించుకున్నాయి. ఆలూరు నుంచి హత్తిబెళగల్ వరకు, హైవే 167 నుంచి గోనేహాల్, కాత్రికి, అరికెర తండా గ్రామాలకు రూ. 3.50 కోట్లతో రోడ్డ నిర్మాణాలు పూర్తి చేశారు. గతంలో ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ప్రయాణం ఎంతో హాయిగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆలూరు-హత్తిబెళగల్ రోడ్డు



గోనేహాల్ గ్రామానికి వెళ్లే రహదారి

దివ్యాంగుల భవితకు బంగారు బాట

- బడిబాట పట్టేలా సమగ్రశిక్ష అధికారుల సర్వే
- ప్రత్యేక అవసరాల పిల్లలకు వెసులుబాటు
- భవిత కేంద్రాలను పాఠశాలలకు అనుసంధానం

ప్రత్యేక అవసరాల పిల్లల్లో మానసికంగా, శారీరకంగా ఎదుగుదలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. భవిత కేంద్రాల ద్వారా వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. మరోఅడుగు వేసి గత ఏడాది నుంచి సమీప పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పేందుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా నియోజకవర్గంలో అలాంటి చిన్నారులను గుర్తించేకుందుకు ఉపక్రమించింది.

– ఆలూరు రూరల్



ఇంటింటికి వెళ్లి దివ్యాంగ విద్యార్థులను గుర్తిస్తున్న సమగ్రశిక్ష అధికారి



ఆలూరు భవిత కేంద్రంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఐఈఆర్పీ

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 857 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారు. ఇందులో 120 మంది దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రాల్లో బోధన పొందుతున్నారు. మరికొందరు పాఠశాలల్లో, బడికి రాలేని స్థితిలో ఉన్న వారు ఇంటి వద్దనే బోధిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరానికి దివ్యాంగులు బడిబాట పట్టేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. సమగ్ర శిక్ష అధికారులతో ఇంటింటికి వెళ్లి ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు సేకరించి వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించనున్నారు. ఈ సర్వే ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. జూన్ 9వ తేదీ వరకు ఇంటింటి సర్వే కొనసాగనుంది. ఇప్పటి వరకు ఆలూరు మండలంలో 15 మంది, ఆస్పరిలో 8 మంది, చిప్పగిరిలో నలుగురు, హాలహర్వి మండలంలో 10 మంది, హొళగుంద మండలంలో 18, దేవనకొండ మండలంలో 14 మంది విద్యార్థులను గుర్తించారు.

పాఠశాలలకు అనుసంధానం..

ప్రాథమిక పాఠశాలతో సమీప భవిత కేంద్రాలను అనుసంధానం చేశారు. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మాటలు రాని, మానసికంగా ఎదుగుదల లేని, నడవలేని పిల్లలు ఇళ్లలో ఉండి మానసికంగా కుంగిపోకుండా వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందిస్తున్నారు. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధిస్తున్నారు. ఈ తరహా విద్య, శిక్షణలో వృద్ధి చెందిన వారిని ఆపై సాధారణ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరుగా కాకుండా వారిలో అందరూ సమానమనే భావనను తెలియజేస్తూ సాధారణ పిల్లలతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన చదువు చెప్పించేలా చర్యలు తీసుకుంది. దీని కోసం మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాలల్లో విలీనం చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలతో పిల్లలకు విద్యాబోధన అందిస్తున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యా కిట్లు, విద్యాదీవెన వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ప్రయోజనాలు

దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టు, వ్యాయామం, స్పీచ్ థెరపీ, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. భవిత కేంద్రాల్లో అడ్మిషన్లు పొందిన ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రతి నెలా రూ.300 రవాణా భత్యం చెల్లిస్తారు. స్టైఫండ్ రూ.2 వేలు, ఎస్కార్ట్ అలెవెన్స్ రూ.3 వేలు, ఇంటి వద్దే విద్య అలెవెన్స్ రూ.2 వేలు అందిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి చెవుడు, మూగ వారికి ట్యాబ్‌లతో పాటు నడవలేని వారికి ఉచితంగా ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, సీపీ చైర్లు, వైకల్య శాతం అధికంగా ఉంటే సదరం ధ్రువపత్రాలు అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి పింఛన్ అందిస్తారు. అలాగే భవిత కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న పిల్లలకు వారి ఇంటికే వెళ్లి బోధనతో పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్టే హాజరు నమోదు అవుతుంది.

సర్వే చేస్తున్నాం

దివ్యాంగుల సర్వే ముమ్మరం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధిస్తాం. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు, ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– రామదాసు, ఐఈఆర్పీ, ఆలూరు

లైంగికదాడి కేసుపై డీఎస్పీ విచారణ



స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

హాలహర్వి: రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో జరిగిన బాలికపై లైంగిక దాడి కేసుపై పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఆయన స్టేషన్‌కు చేరుకుని కేసు విషయమై ఎస్ నరేంద్రను ఆరా తీశారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు వీరేష్‌ను ఉదయమే అరెస్ట్ చేసి జైలుకు తరలించామని డీఎస్పీకి ఎస్ఐ విన్నవించారు. అనంతరం బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను విచారించారు. ఆ తర్వాత కాసేపు స్థానికులతో మాట్లాడారు. గ్రామంలో ఐకమత్యంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

గొడవలకు పాల్పడవద్దు

వెల్దుర్తి(కృష్ణగిరి): వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల సందర్భంగా ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి సూచించారు. శనివారం ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన గోవర్ధనగిరి, బోగోలు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలెలా ఉన్నా ప్రశాంతత ముఖ్యమన్నారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకు సరిపోతాయని, పల్లెలు, గ్రామాల్లో ప్రజలు కలిసి మెలిసి ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని, క్షణికావేశాలతో ప్రశాంతతను దూరం చేసుకోవద్దని సూచించారు. ఫలితాల సందర్భంగా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటిని వృథా చేయొద్దు

ఆలూరు: హాలహర్వి, చింతకుంట గ్రామాల రిజర్వాయర్ల నుంచి గ్రామాలకు సరఫరా అయ్యే తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆలూరు డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య సూచించారు. విరుపాపురం, సమ్మత్‌గేరి రిజర్వాయర్లలోని నీటి నిలువ సామర్థ్యాన్ని ఆయన శనివారం పరిశీలించారు.